క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

నిడదవోలు: పట్టణంలో తీరుగూడెం 11 కేవీ విద్యుత్ ఫీడర్ మరమ్మతులు, చెట్ల కొమ్మల కటింగ్ నిమిత్తం బుధవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు నిడదవోలు విద్యుత్ ఈఈ ఎస్.నారాయణ అప్పారావు తెలిపారు. పట్టణంలో తీరుగూడెం, సుబ్బరాజుపేట, జ్యోతి కాలనీ, ఎన్టీఆర్ కాలనీ, సింగవరం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు.

తాళ్లపూడిలో వరల్డ్ బ్రెయిన్ డే



తాళ్లపూడిలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న టీచర్

తాళ్లపూడి: వరల్డ్ బ్రెయిన్ డే సందర్భంగా స్థానిక విజేత హైస్కూల్ వద్ద ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ప్రధానోపాధ్యాయులు డాక్టర్ జీవీ ప్రమోద్‌కుమార్ ఆధ్వర్యంలో బయాలజీ టీచర్ ఎం.కరుణ విద్యార్థులకు బ్రెయిన్ మోడల్ చూపుతూ బ్రెయిన్ పని తీరును వివరించారు. మానసిక ఒత్తిడి తగ్గించుకునేందుకు ధ్యానం, యోగా చేయాలని సూచించారు. నాడీ కణాలు చురుగ్గా పని చేసేందుకు పజిల్స్, పుస్తకాలు చదవడం మంచిది అని తెలిపారు. ఉపాధ్యాయులు కరిష్మా, గంగారత్నం, నిస్సి, సలోమి, మేరీ కిరణ్మయి, సాయి లత, వెంకట్, విజయ్ రాజు, ఆలీ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

డీఎడ్ కౌన్సెలింగ్ 24 వరకూ పొడిగింపు

నల్లజర్ల: డీఎడ్ కౌన్సెలింగ్ ఈనెల 24వ తేదీ వరకు పొడిగించినట్టు దూబచర్ల డైట్ కళాశాల ప్రిన్సిపాల్ బెం.కమలకుమారి తెలిపారు. డైట్ కళాశాలకు కేటాయించిన(పూర్వపు పశ్చిమగోదావరి జిల్లా) 99 సీట్లకు గాను ఇంత వరకు 55 మంది అభ్యర్థులకు తమ ఒరిజనల్ సర్టిఫికెట్లు పరిశీలించి అడ్మిషన్ లెటర్స్ ఇచ్చినట్టు చెప్పారు. ఇంతవరకు సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరుకాని అభ్యర్థులు ఈనెల 24వ తేదీలోగా హాజరై తమ ఒరిజినల్ సర్టిఫికెట్లను అందించి, ప్రవేశాలకు అర్హత పత్రాలను పొందాలని ఆమె తెలిపారు.

నిత్యావసరాల పంపిణీ

నిడదవోలు: స్థానిక మానసిక దివ్యాంగుల స్వచ్ఛంద సంస్థ (హృదయాలయం)లో రోటరీ సెంట్రల్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు పైడి సురేష్, ఎస్.చంద్ర కిరణ్, జీవీవీ సత్యనారాయణ, గోపాలకృష్ణ, సుబ్రహ్మణ్యం, సత్యనారాయణ, ఓ.రామకృష్ణ, ఎస్. మధుసూదన్‌రావు, ఆరిఫ్‌ఖాన్, నిర్వాహకులు దండే గణేష్, బలగం విశాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా వైద్యం



కానూరు అగ్రహారంలో సంచార చికిత్స చేస్తున్న వైద్య సిబ్బంది

పెరవలి: ప్రభుత్వం ఇంటింటికీ వైద్యం అందించాలనే ఉద్దేశంతో సంచార చికిత్స కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు కానూరు పీహెచ్‌సీ వైద్యాధికారి పి.తేజశ్రీ తెలిపారు. కానూరు అగ్రహారంలో మంగళవారం ఇంటింటా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో 198 మందికి బీపీ, 162 మందికి సుగర్ పరీక్షలు చేసి, మందులు అందించామని తెలిపారు. జూలైలో డెంగీ, మలేరియా వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉందని, ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తాగాలని అన్నారు. మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలని నిల్వ ఉంటే దోమలు వ్యాప్తి చెంది చికెన్‌గున్యా, డెంగీ జ్వరాలు వ్యాప్తి చెందుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఓ ఏ రాజా, మోహన్, సూపర్‌వైజర్ కేవీ నాగేశ్వరరావు, జీ దుర్గాప్రసాద్, అరుణ, గౌరీప్రియ పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు



నిందితుడిని రాజమహేంద్రవరం కారాగారానికి తరలించిన పోలీసులు

గోపాలపురం: హత్య కేసులో తప్పించుకు తిరుగుతున్న ముద్దాయిని అరెస్టు చేసి కోర్టుకు తరలించగా అతనికి 14 రోజులు రిమాండ్ విధించినట్లు గోపాలపురం ఎస్సై పి.మనోహర్ మంగళవారం విలేకరులకు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. 2016లో ఒక హత్యకేసులో ముద్దాయిగా ఉన్న మర్రి శేఖర్ బెయిల్‌పై బయటకు వచ్చి గత కొంత కాలంగా కోర్టుకు హాజరు కాకుండా తప్పించుకుని తిరుగుతున్నాడు. అతనిని పట్టుకుని కొవ్వూరు 9వ అడిషనల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి ముందు హాజరుపరచగా 14రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్సై తెలిపారు. అతనిని రాజమహేంద్రవరం జిల్లా కారాగారానికి తరలించామన్నారు.

ముంపులో పంట భూములు

- ఆక్రమణ చెరలో మురుగు కాలువ
- చిన్న వర్షానికే నీట మునుగుతున్న పొలాలు
- గగ్గోలు పెడుతున్న రైతులు

పెరవలి: ఖరీఫ్ సాగు కష్టాలతో మొదలైంది. కొన్ని ప్రాంతాల్లో నీరు లేక ఇబ్బందులు పడుతుంటే, మరి కొన్ని చోట్ల నీరు ఎక్కువై పంటలు నీటపాలైంది. నాట్లు వేసిన చేలు నీట మునిగిపోవడంతో రైతులే స్వచ్ఛందంగా మురుగుబోదెలను తవ్వి నీరు బయటకు వెళ్లేలా చేస్తున్నారు. ప్రభుత్వం పండిన పంటకు సొమ్ములు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నా, సాగునీరు లేకున్నా రైతులు ఖరీఫ్ సాగుకు అప్పులు చేసి సన్నద్ధమవుతున్నారు. పెరవలి మండలం కానూరు, కానూరు అగ్రహారం, ఉసులుమర్రు గ్రామాల్లో వర్షం వస్తే పంట పొలాలు నీట మునిగిపోవడం, మురుగునీరు వెళ్లే కాలువలు ఆక్రమణలకు గురవ్వడంతో మురుగునీరు బయటకు వెళ్లపోవడం వలన పంట భూములు నిలువునా మునిగిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కానూరు, కానూరు అగ్రహారంలో అక్రమ రొయ్యిలు, చేపలు చెరువుల యజమానులు మురుగు కాలువను ఆక్రమించుకోవడంతో పాటు కాలువపై ఎక్కడికక్కడ తూరులు పెట్టి ర్యాంపులు వేసుకోవడంతో నీటి ప్రవాహానికి ఆటంకాలు ఏర్పడి నెమ్మదిగా సాగుతోంది. దీంతో పంట భూముల్లో నీరు బయటకు పోకపోవడంతో ముంపు బారిన పడుతున్నాయని రైతులు వాపోతున్నారు.

ముంపులో పంటలు

పెరవలి మండలంలో కానూరు అగ్రహారంలో 250 ఎకరాల చేలు మునిగిపోవడంతో నాట్లు వేయలేదని, అదే ఉసులుమర్రు గ్రామంలో సాగునీరు అందక 200 ఎకరాలు నాట్లు వేయలేదని, కానూరులో 150 ఎకరాల్లో నాట్లు వేసినా ముంపు బారిన పడి ఉన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి కారణం మురుగు బోదెలు ఆక్రమణలకు గురవడమేనని చెబుతున్నారు. చేపల, రొయ్యిల చెరువుల వలన కాలువ గట్లు వెడల్పు



కానూరు అగ్రహారంలో నీట మునిగిన వరిచేలు



కానూరులో నీట మునిగిన చేలు



కానూరులో పొక్లెయిన్‌తో మురుగు కాలువ తవ్వకం

పెరగడం కాలువ కుచించుకుపోయి నీరు సాగడం లేదు. పెండ్యాల, మునిపల్లి గ్రామాల పంట భూముల నుంచి మురుగునీరు, చెరువు నుంచి వచ్చే మురుగునీరు ఈ కాలువ ద్వారానే రావాల్సి ఉంది. కానూరు వచ్చే సరికి కాలువ కుచించుకుపోవడంతో ఈ గ్రామాలతో పాటు కానూరు, కానూరు అగ్రహారం, ఉసులుమర్రు, నడుపల్లి గ్రామాల పంట భూములు మురుగు నీరంతా ఈ కాలువ ద్వారానే పోవాల్సి ఉంది. వేసవిలోనే ఈ కాలువ ఫుల్‌గా నీరు వెళుతుంది. ఇక వర్షాకాలంలో కాలువ గట్లపై నుంచి ప్రవహించడంతో పంట భూములు ముంపుబారిన పడుతున్నాయి.

హామీ తప్ప ఏమీ లేదు

మురుగు కాలువపై మంత్రి కందుల దుర్గేష్‌కు వివరించినా మురుగునీరు పోయేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇవ్వటమే తప్ప ప్రస్తుతం ఏమీ చేయలేదు. నాట్లు వేసిన చేలు ముంపు బారిన పడడంతో రైతులు నానా అగచాట్లు పడుతున్నారు. మురుగు కాలువలో పేరుకుపోయిన తూడు, గుర్రపుడెక్కను పొక్లెయిన్‌తో తొలగించి తవ్వకాలు చేస్తున్నామని రైతులు చెబుతున్నారు. ఏదీ ఏమైనా ఖరీఫ్ సాగు రైతులకు కష్టాన్ని నష్టాన్ని తెచ్చిపెడుతుందని రైతులు వాపోతున్నారు.

మంత్రి దృష్టికి తీసుకెళ్లాం



చెరువులు వలన మురుగు నీరు లాగకపోవడంతో చేలు ముంపునకు గురవడంతో నేటి వరకు నాట్లు వేయలేదు. ఈ విషయంపై మంత్రి దృష్టికి తీసుకెళ్లాం. ఇంత వరకూ ఏం చేయలేదు. ఖరీఫ్ మొదలైంది. పనులు చేయలేకపోతున్నాం. ఇది ఎప్పటికి సరి చేస్తారో ఏమో తెలియడం లేదు.

– హనుమంతు సతీష్, రైతు కానూరు అగ్రహారం

అడుగడుగునా ఆక్రమణలే



మురుగు కాలువ అడుగడుగునా ఆక్రమణలకు గురిఅవ్వటంతో మురుగునీరు లాగక పంట చేలు ముంపుబారిన పడుతున్నాయి. దీని వలన ఖరీఫ్ పంట ఎలా ఉంటుందోనని ఆందోళన చెందుతున్నాం. ఇప్పటి వరకు నాట్లు వేయలేదు.

– మేకల శ్రీనివాస్, రైతు కానూరు అగ్రహారం

పంటలు వేయకుండానే..



చెరువుల నుంచి వచ్చే మురుగునీరు పంట చేలను ముంచెత్తడంతో పంటలు సక్రమంగా పండడం లేదు. ఈ ఏడాది మరీ దారుణంగా నాట్లు వేయకుండానే చేలు ముంపు బారిన పడ్డాయి. నీరు ఎప్పటి లాగుతుందో నాట్లు ఎప్పుడు వేయాలో తెలియటంలేదు.

– అధికారి వెంకటేష్, రైతు కానూరు అగ్రహారం

మహిళల అభ్యున్నతికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ సింహాద్రిరావు

నల్లజర్ల: వెలుగు సంఘాల ద్వారా రుణాలు అందించి మహిళా అభ్యున్నతికి కృషి చేయాలని ఎంపీడీఓ సింహాద్రిరావు సూచించారు. నల్లజర్ల వెలుగు కార్యాయలంలో మంగళవారం జరిగిన యానిమేటర్లు, గ్రామ సంఘ అధ్యక్షులు, సీసీలకుకు నిర్వహించిన ఒకరోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు అనేక పథకాల పేర్లతో రుణ సహాయం అందిస్తున్నట్లు చెప్పారు. పశుపోషణ, తినుబండారాల తయారీ, నిత్యావసర సరకుల అమ్మకాలు వంటివి ఏర్పాటు చేసుకుంటే ప్రతి నెలా ఆదాయ వనరులుగా మార్చుకోవచ్చునన్నారు. అందుకు మీరంతా గ్రామాల్లో మహిళా సంఘాలను సమీకరించి మహిళల్లోని ఆలోచనలకు కార్యరూపం ఇవ్వాలన్నారు. రుణాలు పక్కదారి పట్టకుండా యానిమేటర్లు గమనించాలన్నారు. ఏపీఎం శ్యాంసుందర్ మట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు జాబ్‌కార్డ్స్, ఇళ్లపట్టాలు, ఇళ్ల నిర్మాణం, సామాజిక భద్రతా పింఛన్లు తదితర వాటిని మహిళల భాగస్వాములను చేయాలన్నారు. స్వయం సహాయక సంఘ సభ్యులతో ప్రణాళికలు తయారు చేయించాలన్నారు. కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు గుత్తికొండ సత్యవతి, యానిమేటర్లు, సీసీలు మాలినీ, రాధామురళీకృష్ణ, పద్మావతి, ఆశాజ్యోతి పాల్గొన్నారు.

అధికారులు వచ్చినా ఫలితం శూన్యం



అన్నవరప్పాడులో రోడ్డుపై అడ్డుకట్ట తొలగించి బ్లీచింగ్ చల్లుతున్న సిబ్బంది

పెరవలి: అధికారం ఉంటే అనధికార పనులు ఏమైనా చేయొచ్చని అన్నవరప్పాడు గ్రామంలో ఇద్దరు జనసేన నాయకులు నిరూపిస్తున్నారు. వడలి–ముక్కామల ఆర్అండ్‌బీ రహదారి మురుగు కాలువలా తయారయ్యింది. రోడ్డుపై మురుగునీరు వదలకుండా చర్యలు తీసుకోవాల్సిన పంచాయతీ అధికారులు పట్టించుకోవడంలేదు. దీంతో సమీప నివాసితులు, ప్రయాణికులు తీవ్ర దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని పత్రికల్లో పలు సార్లు రావడంతో అదే గ్రామానికి చెందిన కొందరు పీజీఎస్ఆర్‌లో ఫిర్యాదు చేశారు. పంచాయతీ అధికారులు మంగళవారం వచ్చి రోడ్డుకి అడ్డంగా ఉన్న అడ్డుకట్ట తొలగించి ఫొటోలు తీసుకుని వెళ్లారు. కానీ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఎందుకంటే వారు వెళ్లిన వెంటనే రాజకీయ నాయకుల అండదండలతో యథాస్థితిలో రోడ్డుకి అడ్డుకట్ట వేశారు. ఇదంతా చూసిన గ్రామస్తులు ముక్కున వేలేసుకున్నారు. ఉన్నతాధికారులు దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

‘ధూప దీప నైవేద్యా’నికి ఆలయాల ఎంపిక

నిడదవోలు: మండలంలోని కంసాలిపాలెం, సూరాపురం, పెరవలి మండలంలో తీపర్రు, ఉండ్రాజవరం మండలంలో సత్యవాడ గ్రామాల్లో నాలుగు దేవాలయాలు ధూపదీప నైవేద్యం పథకానికి ఎంపికైనట్లు రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒక్కో దేవాలయానికి ప్రతి నెలా రూ.10వేల ఆర్థిక సాయం అందుతుందన్నారు. రూ.10 వేలలో దేవాలయ అర్చకుడికి రూ.7 వేలు, ధూపదీప నైవేద్యాలకు రూ.3 వేలు వినియోగించాలని ఆయన వెల్లడించారు. ఈ పథకంతో ఆలయాల్లో సేవలు నిర్వహిస్తున్న అర్చకులకు ఆర్థిక స్వావలంబన చేకూరుతుందన్నారు. త్వరలోనే మరిన్ని ఆలయాలు ఎంపిక చేసేందుకు కృషి చేస్తామన్నారు.

ప్రజల దృష్టిని మళ్లించడానికి అక్రమ అరెస్టులు

వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కంతమని రమేష్‌బాబు



తాళ్లపూడి(కొవ్వూరు): ప్రజల దృష్టిని మళ్లించడానికి కూటమి ప్రభుత్వం అక్రమ అరెస్టులు చేస్తుందని జిల్లా వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కంతమని రమేష్‌బాబు అన్నారు. మంగళవారం ఆయన ‘సాక్షి’తో మాట్లాడుతూ రాజమండ్రి పేపర్‌మిల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పోరాటం చేస్తున్న రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజాను పోలీసులు అరెస్టు చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజల పక్షాన శాంతియుతంగా పోరాటం చేస్తున్న ఆయనను రాత్రికి రాత్రి అరెస్టు చేసి హక్కులను కాలరాస్తున్నారని అన్నారు. లిక్కర్ కేసులో ఎంపీ మిథున్‌రెడ్డి కావాలని కక్ష పూరితంగా అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించాలని అన్నారు. రాష్ట్రంలో రెడ్‌బుక్‌పాలన సాగిస్తున్నారని అన్నారు. జిల్లాలో మద్యం, ఇసుక మాఫియాగా మారి దోచుకుంటున్నారని అన్నారు. ప్రజలను దోపిడీ పాలన నుంచి, ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంతో తిరుగుబాటు వస్తుందని వారిని దృష్టి మళ్లించానికి అక్రమ కేసులు పెడుతున్నారని కంతమణి రమేష్‌బాబు ఆరోపించారు.

సార్వత్రిక విద్యా పీఠంలో అడ్మిషన్లు

- ఈనెల 31 వరకూ గడువు
- కోఆర్డినేటర్ అంబటి శ్రీనివాసరావు

నల్లజర్ల: అనుకోని పరిస్థితుల్లో చదువుకు దూరమైన వారికి ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం(ఓపెన్ స్కూల్ సొసైటీ) అండగా నిలుస్తుందని దూబచర్ల ఏ1 స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ అంబటి శ్రీనివాసరావు తెలిపారు. పది, ఇంటర్ ప్రవేశాలకు అవకాశం కల్పిస్తున్నట్టు చెప్పారు. వయస్సుతో నిమిత్తం లేకుండా 14ఏళ్లు నిండిన వారంతా నేరుగా పదో తరగతిలో చేరవచ్చునన్నారు. పరీక్షలలో తప్పిన వారు చేరేందుకు అవకాశం ఉంది. 2025–26 విద్యాసంవత్సరానికి సంబంధించి ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైందన్నారు. ఆన్‌లైన్‌లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చని, అడ్మిషన్లకు ఎటువంటి అపరాధ రుసుం లేకుండా జూలై 31 వరకు అవకాశముందన్నారు. ఇంటర్ మానేసిన వారు, ఫెయిల్ అయిన వారు తిరిగి చదువుకునే అవకాశం ఉందన్నారు.

నిబంధనలు

- పదో తరగతిలో ప్రవేశానికి 14 ఏళ్లు నిండి ఉండాలి.
- ఒకటి నుంచి ఐదు తరగతులు వరకూ చదివిన సర్టిఫికెట్ గానీ జనన ధ్రువీకరణ పత్రం అందించాలి.
- పదో తరగతిలో 5 సబ్జెక్ట్‌లు ఉంటాయి. ఆప్షనల్‌గా హిందీని ఎంచుకోవచ్చు.
- సార్వత్రిక విద్యాపీఠం ద్వారా పూర్తి చేసిన కోర్సులకు సమాన గుర్తింపు ఉంటుంది. ఓపెన్ స్కూల్ ద్వారా పూర్తి చేసిన వారు ధ్రువీకరణ పత్రాలతో ఉన్నత విద్య, ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఉన్నత కోర్సులలో సీట్లు, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పొందవచ్చు.
- ప్రతి ఆదివారం, రెండో శనివారం తరగతులు నిర్వహిస్తారు. ఏడాదిలో 30 తరగతులు ఉంటాయి. వీటిలో కనీసం 24తరగతులకు హాజరైతే చాలు. కోర్సులలో చేరి ఐదేళ్ల కాలపరిమితిలో 9 సార్లు పరీక్షలు రాసి ఉత్తీర్ణులు కావచ్చు.

సైబర్ నేరాలపై అవగాహన

కంబాలచెరువు: సమాజంలో మితిమీరుతున్న సైబర్ నేరాలపై స్థానిక ప్రకాశ్‌నగర్, సైబర్ ల్యాబ్ పోలీసులు మంగళవారం బొల్లినేని పారా మెడికల్ విద్యార్థులు, సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై సతీష్ మాట్లాడుతూ, సోషల్ మీడియా వినియోగంలో అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్, టెలిగ్రామ్, స్నాప్‌చాట్, స్కైప్‌లో అపరిచితులతో చాటింగ్ చేయవద్దన్నారు. అనవసర లింకులను, అప్లికేషన్లను క్లిక్ చేస్తే అనేక అనర్థాలు తప్పవన్నారు. సైబర్ నేరాలకు విద్యావంతులే ఎక్కువగా గురికావడం ఆందోళనకరమన్నారు.

ఇటీవల టాస్క్ ఫ్రాడ్, ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్, డిజిటల్ అరెస్ట్, కొరియర్ ఫ్రాడ్‌లో అపరిచితులు డాక్టర్ల వద్ద నుంచి రూ.కోట్లు కాజేశారన్నారు. అటువంటి విషయాలపై జాగ్రత్త వహించాలని కోరారు.

జవహర్‌పై టీడీపీ అగ్రకుల నాయకుల వేధింపులు

- ఎస్సీ నియోజకవర్గంలో ఎస్సీలకు మాట్లాడే అవకాశం లేదా
- టీడీపీలో చల్లారని వర్గపోరు



తాళ్లపూడిలో జవహర్‌కు అనుకూలంగా వ్యతిరేక వర్గంపై నినాదాలు చేస్తున్న దళిత నాయకులు

తాళ్లపూడి(కొవ్వూరు): పశివేదలలో ఫ్లెక్సీల వివాదంతో మొదలైన కొవ్వూరు టీడీపీలో వర్గపోరు ఇంకా రగులుతోంది. పెండ్యాల అచ్చిబాబు, ఎమ్మెల్యే వర్గం అలాగే ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ కేఎస్ జవహర్ వర్గం పరస్పర ఆరోపణల పరంపర కొనసాగుతోంది. సోమవారం టీడీపీలోని దళిత నాయకులు జవహర్ వర్గంపై చేసిన ఆరోపణలకు దీటుగా మంగళవారం తాళ్లపూడి, కొవ్వూరు ప్రెస్ క్లబ్‌లో వేర్వేరుగా విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వారి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. తాళ్లపూడిలో జవహర్‌కు అనుకూలంగా, వ్యతిరేక వర్గం వ్యాఖ్యలపై నిరసన తెలిపారు.

కొవ్వూరు మండలం పశివేదల గ్రామంలో నెలకొన్న ఫ్లెక్సీ వివాదంపై దళిత వర్గాలు ఎస్సీ కమిషన్ చైర్మన్ అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా తాళ్లపూడిలో జరిగిన సమావేశంలో టీడీపీ రీజనల్ ఎస్సీ కోఆర్డినేటర్ ఆకుమర్తి చిన్నా మాదిగ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్సీల అభ్యున్నతి కోసం, వారి రక్షణ కోసం ఏర్పాటు చేసిన ఎస్సీ కమిషన్ చైర్మన్ పదవి నుంచి తప్పించాలని కొవ్వూరులో కొంత మంది టీడీపీ నాయకులకు తొత్తులుగా పని చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఇది దళితుల ఆత్మాభిమానానికి అగ్రకులాల అహంకారానికి మధ్య జరిగే పోరాటమని అన్నారు. ముఖ్యంగా ఈ సమస్య 23వ తేదీ సాయంత్రానికి పరిష్కారం కాకుంటే 24న జిల్లా ఎస్పీ కార్యాలయం ముట్టడిస్తామన్నారు. తాము రాజకీయం చేయడానికి రాలేదని, రాజ్యాంగ బద్ధంగా నియమించిన ఎస్సీ కమిషన్ చైర్మన్‌పై బడా నాయకుల చర్యలను ప్రశ్నిస్తున్నామన్నారు. తమ దళితులను కాపాడడానికి ఎస్సీ కమిషన్ ఉంటే, ఆ కమిషన్‌ను రక్షించుకోవాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. అలాగే రాష్ట్ర తెలుగు రైతు కార్య నిర్వహణ కార్యదర్శి పసలపూడి సుభాష్ చంద్ర బోస్, ఎమ్మార్పీఎస్ నాయకులు పొరోజు జయరాజు మాట్లాడుతూ, 2014 నుంచి 2019 వరకు అప్పటి ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసిన కేఎస్ జవహర్‌ను రాజకీయంగా అణదొక్కాలని చూశారని, సీటు కూడా రాకుండా చేశారని అన్నారు. ఎస్సీ కమిషన్ చైర్మన్‌గా నియమితులైనా ఆయనపై జమీందారుల వేధింపులు తగ్గలేదన్నారు. మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావును, మాజీ మంత్రి జవహర్‌ను కూడా కొవ్వూరు టీడీపీ అగ్రకుల నాయకులు వేధిస్తూనే ఉన్నారని అన్నారు. పశివేదల ఫ్లెక్సీ వివాదం ఎస్సీలపై దాడి వంటిదేనని, తమకు హక్కు కల్పించిన అంబేడ్కర్‌ను అవమానించినట్టే భావిస్తున్నామని, జవహర్ ఫ్లెక్సీని చింపిన వారు, చేయించిన వారు క్షమాపణ అడగాలన్నారు. ఈ కార్యక్రమంలో తాళ్లపూడి మండలానికి చెందిన నరసయ్య, మెరిపో వెంకట్రావు, కొప్పాక పోసియ్య తదితరులు మాట్లాడుతూ మాజీ మంత్రి జవహర్ నేడు రాష్ట్ర ఎస్సీల ప్రయోజనం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నియమించిన ఎస్సీ కమిషన్ చైర్మన్‌గా ఉన్నారని, కొవ్వూరు టీడీపీ అచ్చిబాబు జమిందార్ వర్గం జవహర్‌పై కక్ష సాగిస్తున్నారని, ఎన్నికల ముందు కూడా జవహర్‌పై చులకనగానే మాట్లాడారని, జవహర్‌పై చులకనగా వ్యవహరించి, ఫ్లెక్సీల చించివేతకు కారణమైన అందరిపై కేసు పెట్టాల్సిందేనని, దళితుల మనోభావాలు దెబ్బ తీసే ఏ కార్యక్రమానైనా తాము వ్యతిరేకిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గేల్లా మని, నాగు, కోడమంచిలి వెంకట్రావు, మల్లిపూడి రాంబాబు, కొడమంచిలి సోమరాజు, సుబ్బారావు, నామా సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు ముమ్మరం



పారిశుధ్య పనులు పర్యవేక్షిస్తున్న పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు

సాక్షి ఇంపాక్ట్

నిడదవోలు రూరల్: సమిశ్రగూడెం అరుంధతీపేటలోని పంచాయతీ సిబ్బంది డ్రైన్లలో ఉన్న సిల్టును తొలగించడంతోపాటు పారిశుధ్య పనులు ముమ్మరంగా చేపట్టారు. ఈనెల 22న ‘సాక్షి’లో ‘అటకెక్కిన ప్రభుత్వ వైద్యం’ అనే శీర్షికన ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. పంచాయతీ కార్యదర్శి కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామంలో దోమలు వ్యాప్తి చెందకుండా తగిన చర్యలు చేపడుతున్నామని చెప్పారు. డ్రైన్లలో పేరుకుపోయిన సిల్టును తొలగించడంతోపాటు దుర్వాసన రాకుండా బ్లీచింగ్ చల్లించామని చెప్పారు.

దేవరపల్లిలో ‘పొలం పిలుస్తోంది’



దేవరపల్లిలో వరి చేనును పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి కమల్‌రాజ్

దేవరపల్లి: పొలాల్లో నానో యూరియా ఎరువు జల్లుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.కమల్‌రాజ్ రైతులకు సూచించారు. దేవరపల్లిలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని వరి చేలను పరిశీలించారు. అనంతరం ఖరీఫ్ సాగుపై రైతులకు పలు సూచనలు చేశారు. పొలాల్లో నానో యూరియా ఎరువు జల్లడం వల్ల నత్రజని మొక్కకు మరింత మెరుగుగా అందుతుందని ఆయన తెలిపారు. వరి సాళ్ల మధ్య ఉన్న నాచు, రైతులు జల్లె ఎరువులు, పురుగు మందుల వల్ల గ్యాస్ చేరుతుందన్నారు. దీనిని ఎప్పటికప్పుడు తొలగించుకోవాలని ఆయన రైతులకు వివరించారు. ఆరుతడి పంటగా మినుము సాగు చేసే రైతులకు మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో రాయితీపై విత్తనాలు సరఫరా చేస్తున్నట్టు ఆయన తెలిపారు. పంట నమోదు తప్పనిసరిగా చేసుకోవాలని ఆయన రైతులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ విభాగం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా నేషనల్ ఫ్లాగ్ డే



పాఠశాలలో ఫ్లాగ్ డే నిర్వహిస్తున్న విద్యార్థులు

గోపాలపురం: జాతీయ పతాక దినోత్సవాన్ని విద్యార్థులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. పెద్దాపురం మండల పరిషత్ పాఠశాలలో హెచ్‌ఎం కాకి పోశియ్య మాట్లాడుతూ పింగళి వెంకయ్య రూపొందించిన జాతీయ పతాకాన్ని తిరంగ లేదా త్రివర్ణ పతాకంగా పిలుస్తున్నామన్నారు. ఈ జాతీయ పతాకాన్ని 1947లో జూలై 22 రాజ్యాంగం ఆమోదించిందని విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రత్నమణి, ఎస్.రాజశేఖర్, సీహెచ్ రాజు, సీఆర్పీ కొయ్య నాగరాజు విద్యార్థులు పాల్గొన్నారు.

అచ్యుతానందన్ మృతికి సంతాపం

నిడదవోలు: కేరళ మాజీ ముఖ్యమంత్రి, సీపీఎం నాయకులు కామ్రేడ్ వీఎస్ అచ్యుతానందన్ మృతిపై సీపీఎం పట్టణ శాఖ ఆధ్వర్యంలో బుధవారం సంతాప సభ నిర్వహించారు. అచ్యుతానందన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు జువ్వల రాంబాబు, గంటి కృష్ణ, జి.డానియల్ వై.శ్రీను, ఉస్మాన్, రాఘవ, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.